

కథా కౌముది

# మొగమాటస్థుని డైరీ నుండి

- డా. నారాయణ గరిమెళ్ళ

**శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**22 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**ఉత్తమ కథానిక విభాగం విజేత**

నిన్ననే నా నూట ఐదవ పుట్టిన రోజు జరుపుకున్నాను. నా భార్య కూడా శత సంవత్సరాలను కొద్ది నెలలలో పూర్తి చేసుకోబోతోంది. నూరేసి ఏళ్ళ వయసులతో మేము ఇంకా బతికి బాగుండటాన్ని అనేకమంది ఆశ్చర్యంగా చెప్పుకోవడం మాకు నిత్యం అనుభవేక వేద్యమే. ఇది మాకూ ఒకింత ఆశ్చర్యంగానే ఉంటుంది.

రేడియో మొదలు, టీవి, దిన, వార, పక్ష, మాస పత్రికలు మరియు ఆంగ్ల పత్రికలూ అన్నీ వెరసి నిన్నటితో కలిపి ఇప్పటి వరకూ మా ఇద్దరితో డెబ్బై మూడు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలన్నింటి లో చెప్పిందే చెప్పడం మాకు అలవాటైపోయింది. మా గురించి వ్రాసినదే వ్రాయడం పత్రికల వారికి కూడా అలవాటైపోయింది. ఇంటర్వ్యూలలో మూడు ప్రశ్నలు తరచుగా ఆడుగుతూ ఉంటారు. మొదటిది మీ ఆహారపు అలవాట్లు మీ ఆరోగ్యానికి ఏ విధంగా సహకరించాయి? రెండవది మీ ఆరోగ్యంలో మీ భార్యా భర్తల అన్యోన్యత మరియు కుటుంబ సభ్యుల (పిల్లలు, మనుమలు, మనుమరాండ్రు, ముని మనుమలు, ముని మనుమరాండ్రు మరియు ఇతర బంధువులు) పాత్ర ఎంత? మూడవది మీ శారీరక మరియు మానసిక ఆరోగ్యం కొరకు యోగా , వ్యాయామము, సంగీత సాహిత్యాది కళలు వంటి జీవన శైలులు ఏ విధంగా సహకరించాయి?

వారడిగిన ప్రశ్నలన్నీ సహేతుకమైనవే. గింజ ధాన్యాలెక్కువ ఉండె తిండితో పాటూ, మా దంపతులకి ఒకరిపట్ల మరొకరికి స్నేహానురాగాలు, మా చుట్టూ ఉన్న ఆనంద ఆహ్లాదకరమైన మంచి వాతావరణం, క్రమం తప్పని ఉదయపు నడక ఇత్యాదివన్నీ మా ఆరోగ్య సోపాన పటానికి తప్పని సరిగా చెప్ప వలసిన కారణాలే.

ఐతే, ఏ విషయాలు ఎంత చెప్పినా, తప్పని సరిగా చెప్పి తీరాల్సినది మాత్రం నా స్నేహితుడు ఆనందరావు గురించే. అతడి జీవన విధానం పట్ల ఆసక్తి లేని వారమైతే ఎంతకాలం వరకూ బ్రతికి ఉండె వారమో తెలియదు.

దాదాపు అన్ని ఇంటర్వ్యూలలో అతని తో సాంగత్యం మా సుదీర్ఘ జీవన కాలాల వెనుక ఉన్న ఒక కారణముగా చెప్పాము. కానీ అదేమి చిత్రమో ఎవరూ ఆనందరావు గురించి ఎక్కువగా ప్రశ్నలు వేయరు. వారు ప్రశ్నలు వేసినా వేయకపోయినా మేము చెప్ప వలసినది చెప్పాలనే అనిపిస్తుంది.

తన ప్రమేయం పెద్దగా లేకుండానే సమాజములో మొగమాటస్థుడి గా ముద్ర వేయబడిన ఆనందరావు రెండేళ్ళ క్రితమే తన నూరేళ్ళ వయసులో మరణించాడు. అతని భార్య కూడా గతించి ఏడాది కావస్తోంది. పేరుకు తగ్గట్టే ఆనందం అతని చిరునామా గా ఉండేది.

పుస్తక ప్రియుడు కావడం తో అనేక తెలుగు మరియు ఇంగ్లీష్ పుస్తకాలు కొని దాచుకున్నాడు. తన తదనంతరం ఆ పుస్తకాల బాధ్యత తో పాటూ తన డైరీ నొక దానిని కూడా నాకు అప్పజెప్పాడు. వాటి పట్ల బాధ్యత హక్కులూ కూడా మావి కావడం తో ఈ రోజు ఆనంద రావు డైరీ నుండి కొన్ని పుటలను మీతో పంచుకుంటున్నాను. దీర్ఘ కాలం ఆనందం గా జీవించడానికి ఆనందరావు జీవితం లోని ఇలాంటి విషయాలు మీకూ బాగా సహకరిస్తాయనుకుంటున్నాను. ఆనాటి తేదీలను ప్రాంతాలను వ్రాయడము లేదు.

1

నా పేరు ఆనంద రావైనా నన్ను చాలా మంది మొగమాటస్థుడు గా పిలుస్తూ ఉంటారు. ఆ అదనపు పేరు నాకు ఎప్పుడూ ఆశ్చర్యమే. ఆ పేరు తో పిలవడం వలన నాకు ఎలాంటి బాధా లేదు. అలా పిలిచే వాళ్ళు ఆనందం పొందుతున్నందుకు నాకూ ఆనందంగానే ఉంటుంది. నాకు తెలిసి నేను మొగమాటస్థుడిని కాను. ఎదుటి వారి సంతోషం లో నాకు ఎప్పుడూ సంతోషమే కనిపిస్తుంది. అలాగని, వారి సంతోషం కోసం నన్ను నేను ఏ రోజూ బలి చేసుకున్నానని అనుకోలెదు. నాకు కావలసిన వాటి విషయములో నేను ఎప్పుడూ రాజీ పడ్డానని నాకు అనిపించదు.

చిన్నప్పుడు ఒక్కోసారి సెలవులలో ఆడుకునే వీలు ఉండేది కాదు. అలాంటప్పుడు నాన్న గారు కథలు చెప్పే వారు. కానీ, నా తోటి మిత్రులు ' అంత మొగమాటమైతే ఎలారా? నీకు ఆడుకోవాలని ఉందన్న సంగతి మీ నాన్నకు చెప్పొచ్చు కదా! " అనే వారు.

వాస్తవానికి నేను ఆటలు కోల్పోయినా నాకు కథలు దక్కేవి. అలాగే ఒక్కో సారి కథలకు బదులు ఆటలు ఉండేవి. ఎప్పుడూ సంతృప్తి కి లోటు లేనప్పుడు నేను మొగమాటస్థుడిని ఎలా అయ్యానో ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

2

ఈ రోజు ఆఫీసు నుండి సెలవు పెట్టి పన్నెండు గంటలకే ఇంటికి వచ్చేశాను. కాళ్ళు ఎందుకో బాగా బడలిక గా ఉన్నాయి. చెప్పులు మాత్రం విప్పేసి బట్టలు మార్చుకోకుండా, కాళ్ళు సైతం కడుక్కోకుండా చిన్నపిల్లడి మాదిరి మంచం ఎక్కి నిద్రపోయాను. నా ఈ ప్రవర్తన నాకే ఆశ్చర్యం గా ఉంది. మరి అమ్మకు మరింత ఆశ్చర్యంగా ఉండకుండా ఎలా ఉంటుంది? అమ్మ వచ్చి నన్ను చూసి నవ్వు కుని వెళ్ళింది. అరగంట నిద్ర తరువాత లేవాలని లేదు. కానీ ఆకలి దంచేస్తోంది. ఎలా? మంచం దిగి భోజనం చెయ్యాలని లేదు. నిద్ర పోవాలనే ఉంది. కానీ

కొంచెం ఉదరం భర్తీ ఐతే కూడా బాగుండని ఉంది. సగం నిద్ర, సగం ఆకలితో నేను మంచం పై ఉండగా గదిలోకి అమ్మ ఖాళీ పాత్రతో నీళ్ళతో వచ్చింది. అమ్మకి మరో చేతిలో తుడుచుకునే తువ్వాలు కూడా ఉంది.

నా ఆంతర్యం తెలిసిన అమ్మ ఆంతర్యం నేనూ కూడా గ్రహించి, పాత్ర లోని నీరు లో చేతులు ముంచి బాగా కడుగు కున్నాను. వెంటనే అమ్మ నవ్వుతూ చేతిలో ఉన్న తువ్వాలు అందించింది. నేనూ చిన్నగా నవ్వాను కానీ మాట్లాడ లేదు. తువ్వాలు తో తుడుచుకుని తిరిగి ఇచ్చేసిన నిమిషానికి అమ్మ కంచం నిండా భోజనము తో గదిలోకి వచ్చింది. నాకు నిదుర మత్తు అలసటలోనే నవ్వు కూడా వచ్చింది. మారు మాట్లాడకుండా కంచం అందుకుని మంచం మీదే భోజనం కానిచ్చేశాను. భోజనం చివరిలో అమ్మ మళ్ళీ మరొక ఖాళీ పాత్రతో చేతులు కడుక్కోడానికి నీళ్ళూ తుడుచుకునేందుకు తువ్వాలు తీసుకు వచ్చింది. మంచం దిగ కుండానే భోజనం కానివ్వడం ఎప్పుడూ ఊహించలేదు.

భోజనమయ్యాక అరగంట పాటూ గాఢమైన నిద్ర పట్టేసింది. నిద్ర లేచాక వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయ్యింది. నెమ్మదిగా బట్టలు మార్చుకుని స్నానం చేసి ఇంట్లో వేసుకునే బట్టలతో వచ్చేసరికి అమ్మా నాన్నా టీ తాగుతూ నా కోసం టీ ఉన్న కప్పు ని చూపించారు. అది అందుకుని నేనూ వాళ్ళతో మాటల్లో పడ్డాను.

అమ్మ నా బద్ధకానికి వత్తాసు పలికిందని నాన్నగారు చూస్తే అనేవారేమో!?. కానీ, నా దృష్టిలో అమ్మ నా మనసులో ఏముందో చదివింది. అమ్మ ఎప్పుడూ ఇంతే. అమ్ముంటే నేను ప్రపంచాన్ని జయించేయగలనని అనిపించింది.

3

ఈ రోజు స్నేహితుడి పుట్టిన రోజు కావడంతో రాత్రి భోజనం అందరమూ కలసి బయట తిన్నాము. నాతో సహా స్నేహితులందరూ భుక్తాయాసాలతో వినాయకుడులులా ఉన్నాము. మత్తుగా బరువుగా ఇల్లు చేరుకున్నాను. నా శ్రీమతి పిల్లలకు భోజనం పెడుతోంది. నా ఐదేళ్ళ కూతురు నా అవస్థను చూసి ఏమి నాన్నా అలా ఉన్నావు అని అడిగింది. నెమ్మదిగా చెప్పాను " ఈ రోజు స్నేహితుడి పుట్టిన రోజు పార్టీ ఐతేను, రెస్టారెంట్ లో కొండచిలువ మాదిరి తినేశానమ్మా " అని.

నా కూతురు ముక్కు మీద వేలు పెట్టి నా మాటల్లో తప్పు దొర్లిందన్నట్టు చూసింది. ఏమనుకుందో ఏమో, నా బుగ్గ మీద ముద్దు పెడుతూ " నువ్వు నాన్నవే. నాన్న లాగే తిన్నావు " అంది.

నాకు అర్ధమయ్యింది. నన్ను నేను కొండచిలువ తో పోల్చుకోవడాన్ని నా కూతురు సహించలేకపోయింది. ఆ విషయం చెప్పకుండా 'నువ్వు నాన్నవే' అంది.

ఇంత పసి ప్రాయపు చిన్న మనసులో ఎంత పెద్ద తనం!? సొంతంగా కూడా మన మీద మనం నింద వేసుకోకుండా కాపాడే నా కూతురు లాంటి శ్రేయోభిలాషులు ఉంటే జీవితానికి ఇంకా ఏమి కావాలి?

4

నిన్న రాత్రి పుస్తకం చదువుతూ సోఫా లోనే నిద్రపోయాను. లైట్ ఆప లేదు. దుప్పటీ కప్పుకో లేదు. ఫ్యాన్ గాలి చలికి నిద్ర సుఖంగా ఉన్నా వంటి మీద దుప్పటీ లేని లోటు ఇబ్బంది పెడుతోంది. ఎప్పుడు కప్పిందే ఏమో? నా భార్య నాకు నచ్చినట్టుగా దుప్పటీ కప్పి పోయింది. నన్ను నిద్ర నుండి లేపకుండా నా భార్య చేసిన ఈ సాయం నాకు ఎంత సౌఖ్యాన్నిచ్చిందో? గొప్ప మనిషి.

వందల పేజీల ఆనంద రావు డైరీ లో పైన పేర్కొన్న నాలుగు అంశాలు మచ్చుకి మాత్రమే కొన్ని. ఆనందరావుతో పరిచయమయ్యాక అంతకు ముందు పెద్దగా విలువనివ్వని ఇలాంటి విషయాలకు విలువనివ్వడం ఆయా వ్యక్తులకు పదే పదే మనసులో కృతజ్ఞతలు చెప్పుకుని బయట కూడా ఆ భావాలని వ్యక్తం చెయ్యడం నాకూ నా భార్యకూ కూడా అలవాటయ్యింది.

'ఆరు నెలలు సావాసం చేస్తే వాడే వీడయ్యాడు' అంటే ఏమిటో అనుభవం లోకి వచ్చింది.

దీర్ఘకాలం పాటూ మేము ఆరోగ్యంగా ఆనందంగా ఉండడానికి ముఖ్యమైన కారణం ఇదేనని మావిశ్వాసం.

COMMENTS